తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట
యాద్రాద్రి భువనగిరి
గురువారం
28 మే 2026
పేజీలు : 8
Follow :



# గురుకులాలు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలి

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ఖమ్మం కార్పొరేషన్, మే 27(జనంసాక్షి)** ఖమ్మం కలెక్టరేట్‌లో బుధవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టీ విక్రమార్క జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్., అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, సంబంధిత అధికారులతో కలిసి గురుకుల, సంక్షేమ వసతి విద్యాసంస్థలపై సమీక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ జిల్లాలో ప్రతి సంవత్సరం గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సీట్లు పూర్తిగా భర్తీ కాని రెసిడెన్షియల్ పాఠశాలలపై ప్రత్యేకంగా అధ్యయనం చేసి కారణాలు గుర్తించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో అన్ని వసతి విద్యా సంస్థలు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని తెలిపారు. వేసవి కాలంలోనే అవసరమైన మరమ్మతులు, మౌళిక వసతుల పనులు పూర్తి చేయాలని సూచించారు.ప్రతి రెసిడెన్షియల్ పాఠశాలలో డైట్ ఛార్జీలు, మెనూ వివరాలను తప్పనిసరిగా ప్రదర్శించాలని తెలిపారు. ప్రతి గురుకుల విద్యాసంస్థకు ఒక జిల్లా అధికారిని ఇన్‌చార్జిగా నియమించి, వారు ప్రతి నెల పాఠశాలలను సందర్శించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. జిల్లా అధికారులు రెగ్యులర్‌గా పాఠశాలలను సందర్శించి తనిఖీ నివేదికలు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. వైద్యులు కూడా ప్రతి నెల విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించాలని తెలిపారు.అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాల పరిస్థితిపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన మరమ్మతులు నిరంతరం చేపట్టాలని సూచించారు.

మిగతా 2లో

ప్రకృతి విపత్తు-ఈదురుగాలుల బీభత్సానికి

# నేలమట్టమైన బత్తాయి తోట

## కన్నీరుమున్నీరవుతున్న రైతు

**గుర్రంపోడు: మే 27 (జనంసాక్షి)**



అకాల వర్షం, ఈదురుగాలుల రూపంలో వచ్చిన ప్రకృతి విపత్తు ఒక ఉద్యాన రైతు ఏళ్ల కష్టాన్ని ఒక్క రాత్రిలోనే తుడిచిపెట్టేసింది. కాపుకు వచ్చిన తోట నేలమట్టం కావడంతో ఆ రైతు కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. నల్గొండ జిల్లా గుర్రంపోడు మండలం పాల్వాయి గ్రామంలో ఈ విషాదకర సంఘటన చోటుచేసుకుంది.స్థానికులు మరియు బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వాయి గ్రామానికి చెందిన గట్టుపల్లి మల్లారెడ్డి అనే రైతు తనకున్న భూమిలో ఎన్నో ఏళ్లుగా పెట్టుబడి పెడుతూ, ఎంతో శ్రమించి బత్తాయి తోటను పెంచుకుంటున్నారు. ప్రస్తుతం ఈ తోట చక్కగా ఎదిగి, కాపుకు సిద్ధంగా ఉంది. రాత్రి ఒక్కసారిగా వాతావరణం మారిపోయి తీవ్రమైన ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం కురిసింది.గాలిదుమారానికి తోటలోని సుమారు 40 బత్తాయి చెట్లు ఒక్కసారిగా వేర్లతో సహా పెకలించుకుపోయి నేలకొరిగాయి. ఏళ్ల తరబడి కంటికి రెప్పలా కాపాడుకున్న చెట్లు కళ్ల ముందే కూలిపోవడంతో రైతు మల్లారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ కన్నీటి పర్యంతమయ్యాడు.ఇప్పటికే మార్కెట్లో ఎరువులు, పురుగుమందుల ధరలు పెరిగిపోవడం, కూలీల ఖర్చులు భరించలేక అప్పులు చేసి మరీ ఈ తోటను సాగు చేసినట్లు బాధిత రైతు వాపోయాడు. చేతికొచ్చిన పంటతో అప్పులు తీరుతాయనుకున్న తరుణంలో, ప్రకృతి విపత్తు కారణంగా లక్షల్లో ఆర్థిక నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు. పంట చేతికందే సమయంలో ఇలా జరగడంతో కుటుంబ పోషణ ఎలా అని కన్నీరుమున్నీరవుతున్నాడు.ఒక్క రాత్రిలో తోట సర్వనాశనం కావడంపై స్థానిక రైతులు కూడా తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిరంతరం కష్టపడే రైతులకు

మిగతా 4లో

నాథుడు లేని ఇందుగుల గ్రామం ప్రజాప్రతినిధులు లేకపోవడంతో

# అధికారుల ఇష్టారాజ్యం

- ○సర్పంచ్ లేరనేనా ఈ అడ్డగోలుతనం? దున్నపోతు చందంగా అధికారుల వైఖరి
- ○కథనాలు వచ్చినా కదలని ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖ అధికారులు
- ○ రోడ్డు మధ్యలోనే మృత్యుపాశాల్లా విద్యుత్ స్తంభాలు పట్టించుకోని కాంట్రాక్టర్
- ○ ఎవరి వాటా వారికి అందడం వల్లే ఈ మౌనమా? నిలదీస్తున్న వాహనదారులు




**మాడుగులపల్లి,మే 27 (జనంసాక్షి):** దున్నపోతుపై వర్షం కురిసినట్లు తయారైంది మాడుగులపల్లి మండలంలోని ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖ అధికారుల వ్యవహారశైలి మండల పరిధిలోని ఇందుగుల గ్రామంలో సాగుతున్న సిసి రోడ్డు మధ్యలోనే నిలువెత్తు కరెంటు స్తంభాలను వదిలేసి, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కాంట్రాక్టర్ల అడ్డగోలుతనంపై పత్రికల్లో ఆధారాలతో సహా కథనాలు ప్రచురితమైనా అధికారుల్లో కనీస చలనం లేకపోవడం పట్ల సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది అధికారుల నిర్లక్ష్యపు తీరుపై ఇందుగుల గ్రామస్తులు, వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు

**సర్పంచ్ లేకపోవడమే శాపమైందా?**

ఇందుగుల గ్రామానికి సుదీర్ఘ కాలంగా గ్రామపంచాయతీ ఎన్నికలు జరగకపోవడం, గ్రామానికి సర్పంచ్ లేకపోవడమే ఈ దుస్థితికి కారణమని స్థానికులు మండిపడుతున్నారు గ్రామానికి ఒక ప్రజాప్రతినిధి అంటూ ఉంటే కాంట్రాక్టర్ల అడ్డగోలు పనులను నిలదీసేవారని, అధికారులపై ఒత్తిడి తెచ్చి విద్యుత్ స్తంభాలను పక్కకు జరిపించేవారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఊరికి నాథుడు లేకపోవడంతోనే ఇటు అధికారులు, అటు కాంట్రాక్టర్లు కుమ్మక్కై అడిగేవాడు లేడనే ధీమాతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, కమీషన్ల మత్తులో నిబంధనలను గాలికొదిలేశారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి

**వాటాల మత్తులో నిబంధనలు గాలికో**

మాడుగులపల్లి నుంచి మామిడాల అడ్డరోడ్డు వరకు జరుగుతున్న రోడ్డు నిర్మాణంలో భాగంగా ఇందుగుల గ్రామంలో వేసిన సిసి రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు ఉండటం ఎంతటి ప్రమాదకరమో పత్రికలు ఎండగట్టాయి నిబంధనల ప్రకారం రోడ్డు వేసే ముందే ఈ స్తంభాలను పక్కకు జరపాల్సి ఉంది కానీ, ఇక్కడ కాంట్రాక్టర్‌కు, అధికారులకు ఎవరి వాటాలు వారికి అందడంతో పనులను పర్యవేక్షించాల్సిన బాధ్యతను పూర్తిగా విస్మరించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి పత్రికల్లో వార్తలు వచ్చి రోజులు గడుస్తున్నా ఇటు ఆర్ అండ్ బీ అధికారులు గానీ, అటు కరెంట్ అధికారులు గానీ క్షేత్రస్థాయికి వచ్చి పరిశీలించిన పాపాన పోలేదు ఈ మొండివైఖరి వెనుక సదరు కాంట్రాక్టర్ నుంచి అధికారులకు అందిన భారీ నజరానాలే కారణమనే విమర్శలు గుప్పుమంటున్నాయి

**శవాలు పడ్డాకే స్పందిస్తారా?**

రోడ్డు మధ్యలోనే ఉన్న కరెంటు స్తంభాల

మిగతా 4లో


ఇందుగుల సిసి రోడ్డుపై

మృత్యుపాశాలు

❑వాటాల మత్తులో ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖల అధికారులు
❑రోడ్డు మధ్యలోనే నిలువెత్తు విద్యుత్ స్తంభాలు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని వాహనదారుల ప్రయాణం
❑పత్రికల్లో కథనాలు వచ్చినా కదలని కాంట్రాక్టర్, యంత్రాంగం
❑పెద్ద ప్రమాదం జరిగితేనే నిద్ర లేస్తారా? మాడుగులపల్లి గ్రామస్తుల ఆగ్రహం

జనంసాక్షి
21 May 2026 - Page 9
https://epaper.janamsakshi.org/clip/491825

# గురుకులాలు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలి: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఐదు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనాల పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల్లో ఎన్ని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయో, యంగ్ ఇండియా పాఠశాలలు పూర్తయ్యాక ఎన్ని తరలించవచ్చో ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.ప్రాంతీయ సమన్వయకర్తలు వచ్చే 12 రోజుల్లో అన్ని పాఠశాలలను చెక్‌లిస్ట్ ప్రకారం పరిశీలించి సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరానికి పాఠ్యపుస్తకాలు, యూనిఫాం లు విద్యార్థు లకు సకాలంలో అందించడాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యపై ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, భారీగా నిధులు వెచ్చిస్తున్న నేపథ్యంలో నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు. సిబ్బంది జీతాలు, డైట్ ఛార్జీలు, అద్దెల చెల్లింపులు ప్రభుత్వం క్రమం తప్ప కుండా చెల్లిస్తున్నదని తెలిపారు. మరమ్మతు ల నిధులు కూడా విడుదల చేస్తున్న నేపథ్యంలో పనులు క్షేత్రస్థాయిలో వేగంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పనుల బిల్లులు అధికంగా క్లియర్ చేసినట్లు తెలిపారు. విద్యాశాఖ పనుల బిల్లుల చెల్లింపులకు డీఎంఎఫ్‌టీ నిధులను కూడా వినియోగిస్తామని చెప్పారు. విద్యా సంస్థ లకు ఉచిత విద్యుత్ అందుతున్న నేపథ్యంలో స్వంత భవనాల్లో నడుస్తున్న గురుకులాల్లో సోలార్ ప్యానెల్‌ల ఏర్పాటు కోసం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

## చిల్లేపల్లి బ్రిడ్జి వద్ద పోలీసులు కట్టడి ముట్టడి

### పటిష్టంగా వాహనాల తనిఖీలు

**నేరేడుచర్ల (జనంసాక్షి )**



బక్రీద్ పండగ సందర్భంగా పశువులు,గోవుల అక్రమ రవాణా పై నిఘా ఉంచామని ఎస్ఐ సైదిరెడ్డి అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం లక్ష్యంగా భద్రత కల్పించడం లక్ష్యంగా, బక్రీద్ సందర్భంగా గోవులు, పశు వుల అక్రమ రవాణా నిరోధంలో భాగంగా ఎస్పి నరసింహ ఐపిఎస్ ఆదేశాల మేరకు బుధవారం నేరేడుచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చిల్లపల్లి బ్రిడ్జ్ వద్ద పోలీసు కట్టడి ముట్టడి, నాకాబంది కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పోలీసు సేవలు అందిస్తున్నామని.అక్రమ రవాణా అసాంఘిక కార్యకలాపాలు అనుమానిత వ్యక్తుల కదలికుల నిర్మూలన లక్ష్యంగా కట్టడి ముట్టడి కార్యక్రమం నిర్వహించి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేశామని అన్నారు. పేలుడు సామాగ్రి, మారణాయుధాలు తరలింపు ఏమైనా జరుగుతుందా అని పరిశీలించారు. గంజాయి లాంటివి ఏమైనా తరలిస్తున్నారా అనేది పరిశీలిండం జరిగినది. గంజాయి రవాణా చేసిన వ్యక్తులు మళ్లీ సంచరిస్తున్నారా అనేది నిఘా పెట్టామని గూడ్స్ వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించవద్దు అని సూచించారు.

## తాసిల్దార్ కార్యాలయం ఎదుట వివోఏల ధర్నా

**కల్లూరు మే 27 (జనంసాక్షి)**

గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్ పరిధిలో పనిచేస్తున్న వివో ఏల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ తాసిల్దార్ కార్యాలయం ముందు బుధవారం ధర్నా నిర్వహించి అధికారులకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వివో ఏల గౌరవ అధ్యక్షులు వేము రాంబాబు మాట్లాడుతూ గత 22 సంవత్సరాలుగా క్షేత్రస్థాయిలో సేవలందిస్తున్న వివోఏలకు నెలకు కేవలం 5000 రూపాయలు మాత్రమే ఇవ్వడం దారుణమని అన్నారు. వివో ఏ లను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని కనీస వేతనం 26,000 అమలు చేయాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని సాధారణ, ప్రమాద ,బీమా సౌకర్యం 20 లక్షలు కల్పించాలని 58 జీవోను సవరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వేము నాగమణి, కే నీలవేణి, మల్లిక, రమాదేవి ,విజయలక్ష్మి, దేవమణి ,వెంకట రావమ్మ, అరుణ, జ్యోతి, మాధవి, తదితరులు పాల్గొన్నారు.






### జూన్ 1న పంచాయితీ కార్మికుల

## మహాధర్నాను జయప్రదం చేయండి

### - సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బచ్చలకూర స్వరాజ్యం

**మునగాల, మే 27(జనంసాక్షి):**

గ్రామ పంచాయితీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, వేతనాలను పెంచాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బచ్చలకూర స్వరాజ్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని సుందరయ్య భవనంలో గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధ సంఘం దార రవి కుమార్ అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బచ్చలకూర స్వరాజ్యం మాట్లాడుతూ, గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, మల్టీపర్పస్ వర్కర్ పని విధానాన్ని రద్దు చేయాలని, కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ఆన్లైన్ లో గతంలో నమోదు కాని పేర్లను నమోదు చేయాలని, ప్రభుత్వమే కార్మికుల వేతనాలకు బడ్జెట్ కేటాయించాలని, బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ జూన్ 1న మండల కేంద్రం వద్ద జరుగు పంచాయితీ కార్మికుల మహాధర్నాను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిపి వర్కర్స్ జిల్లా కమిటీ సభ్యులు ఎం. వెంకటేశ్వర్లు, డి. రవి కుమార్,టి ముత్తయ్య, టి చంద్రశేఖర్, జె బజార్, ఆర్ వెంకన్న, బి నర్సయ్య, డి రాజు, మల్సూర్, టి కుమారి తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేని డీజే వాహనం సీజ్

### ఎస్ఐ సైదిరెడ్డి

**నేరేడుచర్ల( జనంసాక్షి)**

మండలంలో అనుమతులు లేకుండా డిజె సౌండ్ సిస్టం ఉపయోగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ సైదిరెడ్డి హెచ్చరించారు. మంగళవారం రాత్రి. బూర్గుల తండా గ్రామంలో తుల్జా భవాని పండుగ సందర్భంగా పెద్ద శబ్దంతో ప్రజా శాంతికి భంగం కలిగించే విధంగా డీజే పెట్టి గ్రామంలో ర్యాలీ తీస్తున్నారని సమాచారం రాగా, వెంటనే అక్కడకు నేరేడుచర్ల పోలీస్ ఘటనా స్థలానికి చేరుకొని, ఎటువంటి పర్మిషన్ లేకుండా డీజే పెట్టి ప్రజా శాంతికి భంగం కలిగిస్తున్న డీజే వాహనాన్ని సీజ్ చేసి, ఆపరేటర్ యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.






## వరి కొయ్యలను కాల్చితే చట్టరీత్యా చర్యలు

### తహసిల్దార్ సరిత

**మునగాల, మే 27(జనంసాక్షి):**

పంట పొలాల్లో వరికొయ్యకాలను ఎవరైనా కాలిస్తే వారిమీద చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని మునగాల తహసీల్దార్ సరిత తెలిపారు. బుధవారం గణపవరం రోడ్డులోని వరి కొయ్యలు కాల్చిన పొలాన్ని తహసిల్దార్ సరిత సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సరిత రైతులను ఉద్దేశించి కొన్ని సూచనలు తెలియజేశారు. రైతులు వ్యవసాయ భూముల్లో వరి కొయ్యలకు నిప్పు పెట్టకూడదని, వరి పంట కొయ్యలకు నిప్పు పెట్టడం వల్ల పొరుగు వారి ఆస్తులు, ఇండ్లు కాలి ప్రాణాల మీదకి వచ్చే అవకాశం ఉందని, రైతులకు తాత్కాలికంగా పొలం శుభ్రమైనట్లు కనిపించినా దానివల్ల నేల పర్యావరణ ఆరోగ్యం మీద తీవ్రమైన దుష్ప్రభావ పరిణామాలు ఉంటాయన్నారు. నిప్పు పెడితే వాయు కాలుష్యం ఏర్పడుతుందని, భూమిలో ఉండే పంటకు ఉపయోగపడే సూక్ష్మజీవులు, మిత్ర పురుగులు చనిపోతాయని, నేల సారవంతం తగ్గుతుందని, సేంద్రియ కార్బన్ తగ్గిపోవడంతో భూమి గట్టిపడుతుందన్నారు. అంతేగాకుండా తదుపరి పంట దిగుబడి తగ్గే అవకాశం ఉంటుందని, భూమిలో కలియ దున్నటంతో, వరి కొయ్యల్లో ఉండే పోషకాలు భూమికి బలాన్ని ఇస్తాయని, రైతులకు లాభదాయకమన్నారు. వేసవిలో వడగాలితో మంటలు క్షణాల్లో విస్తరించి అంటుకొని ప్రమాదాలకు కారణం అవుతాయని, మంట వలన గాలి కాలుష్యమునకు కారణమైన కార్బన్డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ లాంటి హానికర వాయువులు విడుదలవుతాయన్నారు. వాతావరణంలో మార్పులకు ఇది కారణమవుతుందని, ఆరోగ్య సమస్యలు, పొగ వల్ల వాయు శ్వాస వ్యాధులతో సమస్యలతో పిల్లలు పెద్దవారు, ఆస్తమా రోగులుగా ఎక్కువగా ఇబ్బందిపడతారన్నారు. కళ్ళమంట, దగ్గు, ఊపిరి తీసుకోవడం ఇబ్బంది కలుగుతాయని, మంటలు అదుపుతప్పి పక్క పొలాలకు, గ్రామాలకు వ్యాపించే ప్రమాదం ఉందని, విద్యుత్ తీగలకు, చెట్లకు, గడ్డి కట్టలు దగ్ధమయ్యే అవకాశం ఉందని, పొగ వలన రోడ్డు ప్రమాదాలు జరగవచ్చని, పశువులకి మేత కొరత ఏర్పడుతుందని, వరికొయ్యలపై వేస్ట్ డీకంపోజర్ స్ప్రే చేసుకోవడం వల్ల కేవలం 20 రోజులలో గడ్డి మొత్తం కుళ్ళిపోయి, భూమికి మంచి ఎరువుగా ఉపయోగపడుతుందన్నారు. వరి కొయ్యలకు నిప్పు పెట్టకుండా నేలలో కలిపి దున్ని, నీరు పెట్టి సేంద్రియ ఎరువుగా ఉపయోగించుకోవాలని, ఎవరైనా వరి కొయ్యలకు మంట పెట్టినట్లయితే అట్టి వారిపై చట్టరీత్యా కఠిన చర్యలుతీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్ దీన్ దయాళ్, మండల వ్యవసాయ అధికారి బి. రాజు, ఎంపిఓ నరేష్ లు తహసీల్దార్ సరితతో కలిసి సందర్శించారు.

## ఉపాధి కూలీ కొత్త చట్టంతో గందరగోళం

**రాజాపేట మే 27(జనంసాక్షి):**

రాజపేట మండలం పారుపల్లి గ్రామములో ఉపాధి కూలీలతో మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం రాజపేట మండల కార్యదర్శి కట్ట రవి కుమార్ మాట్లాడారు.ఈ సందర్భంగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో ఉన్న చట్టం ద్వారా ఉపాధి కూలీలకు సౌకర్యాలని కల్పించే పరిస్థితి ఉన్నదని, దాంతోపాటు కొత్త చట్టం ద్వారా ఫేస్ ఫోటో బయోమెట్రిక్ ద్వారా పొద్దున మధ్యాహ్నం నాలుగు గంటలకు ఫోటో ఫేస్ ఫోటో తీయడం ద్వారా ఉపాధి కూలీలకు కొంతమందికి ఫోటో రాకపోవడంతో ఇబ్బందులు కలుగుతున్నాయి అన్నారు. కొత్త చట్టం జీవీబీ రాంజీ చట్టం ద్వారా కూలీలకు చాలా ఇబ్బంది జరుగుతుందని వెంటనే రద్దు చేయాలని పాత పద్ధతిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పని కొనసాగించాలని అధికారులు ఆయా గ్రామాలకు సందర్శించి సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లలిత,రాగుల బాలరాజు బండారి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



# అంబేద్కర్ విగ్రహం ముందు రాజకీయ పార్టీ దిమ్మె కట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

✧రాత్రికి రాత్రే దిమ్మ నిర్మాణం
✧ఎక్కడా స్థలం లేదన్నట్టుగా దిమ్మె నిర్మాణం
✧ఉద్దేశపూర్వకంగా కనబడుతున్నదిమ్మె నిర్మాణం
✧పిచ్చి ముదిరి పాకానపడ్డ చందంగా గుర్తుతెలియని వ్యక్తులు చర్యలు
✧భారతరత్నకు నిలువునా అవమానం

**పెనుబల్లి మే 27 (జనంసాక్షి)**
ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం వి ఎం బంజర్ గ్రామపంచాయతీలో రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని కొందరు గుర్తు తెలియని ఓ రాజకీయపార్టీకి చెందిన వ్యక్తులు నిలువునా అవమానించారు. వి ఎం బంజర్ పెనుబల్లి గ్రామపంచాయతీల మధ్య ఉన్న అంబేద్కర్ విగ్రహం ఎదురుగా మంగళవారం అర్ధరాత్రి రాజకీయ పార్టీకి చెందిన గుర్తు తెలియని వ్యక్తులు ఆ పార్టీజెండా దిమ్మెను నిర్మించారు. వి ఎం బంజర్ గ్రామపంచాయతీలో ఆ పార్టీజండా దిమ్మ నిర్మాణానికి స్థలం ఎక్కడ లేదన్నట్టుగా కావాలని మత, రాజకీయ విద్వేషాలను రెచ్చగొట్టేందుకే అంబేద్కర్ విగ్రహం ముందు పార్టీ జెండా దిమ్మెను కొన్ని దుష్టశక్తులు నిర్మించారనిని ఎం ఆర్ పి ఎస్, ప్రజా సంఘాల, వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు అంబేద్కర్ అభిమానులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ప్రపంచ దేశాలు గౌరవించే భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను అవమానించిన గుర్తు తెలియని దుండగులను గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే అంబేద్కర్ విగ్రహం ముందు ఉన్న దిమ్మెను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో అంబేద్కర్ ని అవమానించిన వ్యక్తులు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. దిమ్మెను నిర్మించిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ఎండిఓ అన్నపూర్ణ, వి ఎం బంజర్ ఎస్ ఐ కే వెంకటేష్ కు అఖిలపక్షం ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు.





## పేరుకే అభివృద్ధి పనులు.. చేసేది అవినీతి పనులు..

**మడుపల్లి గోపాలరావు (సిపిఎం డివిజన్ కార్యదర్శి)**

**మధిర, మే 27 (జనంసాక్షి):**
అభివృద్ధి ముసుగులో మధిర మున్సిపాలిటీ లో ప్రభుత్వ ఖజానాకు అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు గండి కొడుతున్నారని సిపిఎం డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు అన్నారు. బుధవారం బోడెపుడి భవనంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కుమ్మక్కై మధిర మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో అందిన కాడికి అవినీతి చేస్తున్నారని ఆరోపించారు. అందులో భాగంగా అంబారుపేట గ్రామంలోని మురుగు నీటి శుద్ధి ప్లాంట్ పేరుతో తక్కువ రేటు ఉన్న భూమిని ఒక కౌన్సిలర్ కోట్లు రూపాయలు పెంచి ప్రజాధనాన్ని దండుకోవాలని చూస్తున్నారని, నిబంధనలకు విరుద్ధంగా చెరువుల నాక్రమించి రియల్ ఎస్టేట్ వెంచర్లు ఏర్పాటు వ్యాపారం తెలిసి తెలియనట్లు వ్యవహరిస్తున్న అధికారులు, అదేవిధంగా మధిర స్మశాన వాటిక పేరుతో మట్టిని అమ్ముకుంటున్నారని, మధిర పలు అభివృద్ధి కార్యక్రమాల్లో అవినీతి జరుగుతుందని, ఈ విషయంపై సమగ్ర విచారణ చేపట్టాలని సిపిఎం పార్టీ నుండి డిమాండ్ చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శీలం నర్సింహారావు, పట్టణ కార్యదర్శి పడకంటి మురళి, మండల కార్యదర్శి మంద సైదులు పాల్గొన్నారు.

## బక్రీద్ సందర్భంగా ఖుర్బానీలో గోవులను కోయ వద్దు

○ప్రభుత్వ నిర్ణయానికి ముస్లిం సోదరులు కట్టుబడి ఉండాలి
○ఆవును జాతీయ జంతువుగా గుర్తించాలి
○కోదాడ పెద్ద మసీదు ఇమామ్ మౌలానా అబ్దుల్ ఖాద్రి సాహెబ్

**కోదాడ,( జనంసాక్షి):**



బక్రీద్ పర్వదినం సందర్భంగా ఖుర్బానీ లో గోవులను కోయ వద్దని కోదాడ పెద్ద మసీదు ఇమామ్ మౌలానా అబ్దుల్ ఖాద్రి సాహెబ్ అన్నారు. బుధవారం కోదాడ పెద్ద మసీదులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గోవులను వధించ వద్దని ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను ముస్లింలందరూ పాటించాలని పిలుపునిచ్చారు. జాతీయస్థాయిలో మత పెద్దలు ఈ నిర్ణయం తీసుకున్నారని వారినిర్ణయం మేరకు గోవులను కుర్బానీ ఇవ్వ వద్దన్నారు. ఆవును జాతీయ జంతువుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు.సర్వ మతాలను గౌరవించాలని, ఎవరి మనోభావాలను దెబ్బతీయ వద్దని అన్నారు. భారతదేశం లౌకిక భారతదేశం అని, దేశంలో అందరూ అన్నదమ్ముల వలె కలిసి ఉండాలన్నారు. బక్రీద్ పర్వదినాన్ని ఆనందోత్సవాలతో జరుపుకోవాలన్నారు. చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరించ వద్దన్నారు. ఈ సమావేశంలో మత పెద్దలు ఎస్ కే ముఫ్టీ అతహర్,మౌలానా అహమ్మద్ నాద్వి,మౌలన అయూబ్, మౌలన హామీ ద్, మౌలానా అతహార్,ఆఫీస్ సిరాజ్, ముక్తి అబ్దుల్ ఖాదిర్, షమ్మా, జహీర్,కాజా, బాబు సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

## వంట మనిషి సహాయకుల పోస్ట్ కై దరఖాస్తుల ఆహ్వానం..

**కనగల్లు, మే 27 (జనంసాక్షి)**
కనగల్లు కేంద్రంలోని (మోడల్ స్కూల్) ఆదర్శ బాలికల పాఠశాల లో వంట చేయుటకు గను సహాయకుల పోస్టుకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు మండల విద్యాధికారి వి. పద్మ తెలిపారు. దరఖాస్తు చేయబోయే మహిళవంట సహాయకుల వయసు 18 నుంచి 45 సంవత్సరాల లోపు వారై ఉండాలని ఈనెల 31లోపు దరఖాస్తులను మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో అందజేయాలని తెలియజేశారు.

## బక్రీద్ ను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి మహమ్మద్ ఖాన్



**బూర్గంపహాడ్ మే 27 (జనంసాక్షి)**
నేడు జరగనున్న పవిత్ర బక్రీద్ (ఈద్-ఉల్-అజ్హా) పండుగను జిల్లాలోని ముస్లిం సోదరు లందరూ అత్యంత భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. పండుగ పవిత్రతను కాపాడుకుంటూనే, ప్రభుత్వ నిబంధనలకు, చట్టానికి లోబడి ప్రతి ఒక్కరూ వ్యవహరించాలని సూచించారు. పండుగ పేరుతో ఆవులను, దూడలను అక్రమంగా రవాణా చేయడం, వధించడం చట్టరీత్యా నేరంమని, ఎవరైనా ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే సంబంధిత అధికారులు చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటారన్నారు. పవిత్ర కుర్బానీ (త్యాగం) కొరకు కేవలం చట్టబద్ధంగా అనుమతించబడిన దున్నపోతులు, మేకపోతులు, గొర్రెపోతులను మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేశారు. జీవాలను ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి తరలించేటప్పుడు తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు పాటించాలని, కొనుగోలుకు, రవాణాకు సంబంధించిన చెల్లుబాటు అయ్యే రహదారి పత్రాలను (రసీదులను) ఖచ్చితంగా దగ్గర ఉంచుకోవాలన్నారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ముస్లిం మైనార్టీలు వ్యవహరించాలని, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం పక్షాన కూడా ఇటువంటి అక్రమాలను ఖచ్చితంగా అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు.

# పిడుగు పాటుకు పాడి గేదె మృతి

○లక్షా యాభై వేల విలువ గల పాడిగెద మృతితో తీవ్రంగా నష్టపోయిన రైతు
○జీవనోపాధి కోల్పోయామని కుటుంబ సభ్యుల ఆవేదన

**కొండమల్లేపల్లి, మే 27 (జనంసాక్షి):**
కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని గాంధీనగర్ శివారులో మంగళవారం కురిసిన అకాల వర్షానికి విషాద సంఘటన జరిగింది. నల్లగాసు మల్లేష్ తండ్రి నారయ్యకు చెందిన వ్యవసాయ పొలం వద్ద పాడి గేద పైన పిడుగు పడడంతో గేద మరణించింది. సుమారు ఒక లక్షా యాభై వేల విలువ గల పాడిగేద మృతి చెందడంతో రైతు కుటుంబం తీవ్రంగా నష్టపోయింది. వ్యవసాయం కూడా అంతంత మాత్రమే ఉన్న రైతు తనకున్న వ్యవసాయ పొలంలో గేదెలను సాకుతో పాలు అమ్ముతూ జీవనోపాధి పొందుతున్న రైతు పిడుగు పాటుతో పాడి గేద మృతి చెందడంతో రైతు కుటుంబ సభ్యులు కన్నీటి పర్యాంతమయ్యాడు. పాడి గేద మృతి చెందడంతో తను జీవనోపాధి కోల్పోయామని ప్రభుత్వం తనను ఆదుకోవాలని వేడుకున్నాడు.



# కోదాడలో తెదేపా మహానాడు కోలాహలం

**కోదాడలో వర్చువల్‌గా మహానాడు భారీగా తరలివచ్చిన తెదేపా శ్రేణులు..**

**కోదాడ,( జనంసాక్షి):**



నల్గొండ పార్లమెంటు నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించిన తెలుగుదేశం పార్టీ పండుగ మహానాడు బుధవారం కోదాడ లో ఘనంగా నిర్వహించారు. మహానాడు కోఆర్డినేటర్లు ముత్తినేని సైదేశ్వర రావు, ఓరుగంటి ప్రభాకర్ ల ఆధ్వర్యంలో వర్చువల్ పద్ధతిలో ఏర్పాటు చేసిన ఈ మహాసభకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి తెదేపా శ్రేణులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించి ఎన్టీఆర్ కు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు అనంతరం సభలో లైవ్ స్క్రీన్ల ద్వారా అధినాయకత్వ సందేశాన్ని కార్యకర్తలు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పట్ల నేటికీ ప్రజల్లో ఏమాత్రం అభిమానం తగ్గలేదని రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై మరింతగా పోరాడుతా మన్నారు. నాయకులు సభా వేదిక పైకి తరలివచ్చి ఐక్యతను చాటుతూ కలిసికట్టుగా పనిచేసి తెలుగుదేశం పార్టీని బలోపేతం చేద్దామని జై తెలుగుదేశం,జై చంద్రబాబు, ఎన్టీఆర్ అమర్ హై అంటూ నినాదాలు చేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సమావేశంలో సాగర్ ఇన్చార్జి ముప్వ అరుణ్ కుమార్, హుజూర్నగర్ మండవ వెంకటేశ్వర్లు, చాగంటి వెంకటేశ్వరరావు, జడ రాములు, కొల్లు సత్యనారాయణ, భయ్యా నారాయణ, కొల్లు నరసయ్య, సాతులూరి గురవయ్య, బండ్లమూడి వెంకటేశ్వర రావు,గుండునాగేశ్వరరావు, పిట్టలశోభన్ బాబు, కోలాశ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఓసీ పత్రాన్ని అందజేసిన ఎమ్మెల్యే పాయం

**బూర్గంపహాడ్ మే 27 (జనంసాక్షి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన యక్కంటి అల్లూరి రెడ్డి సతీమణి ఐన మంగమ్మ కు వైద్య చికిత్స నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల విలువైన ఎల్ఓసీ పత్రాన్ని పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆయన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని తెలిపారు. అవసరమైన వారికి ప్రభుత్వ సహాయ పథకాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వర రెడ్డి, సందా రెడ్డి, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# పచ్చి రొట్ట ఎరువుల సాగుతో భూసారం పెంపొందుతుంది

**కల్లూరు మే 27 (జనంసాక్షి)**

పచ్చిరొట్ట ఎరువులు సాగు చేసినట్లయితే భూసారం పెంపొంది పంటలు అధికంగా దిగుబడి సాధించవచ్చు అని కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగంనీరజాదేవి, మున్సిపాలిటీ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, సొసైటీ అధ్యక్షులు బోబోలు లక్ష్మణరావు తెలిపారు. బుధవారం కల్లూరు విశాల సహకార పరపతి సంఘం లిమిటెడ్ కల్లూరు సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జీలుగు విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి, మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయ క్ , సొసైటీ అధ్యక్షులు బోబోలు లక్ష్మణరావు పాల్గొని రైతులకు జీలుగు విత్తనాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై అందించే జీలుగు విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాల న్నారు. 30 కేజీల విత్తనాల ప్యాకెట్ 50% రాయితీపై 2452 రూపాయలకు రైతులకు అందించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా జనుము విత్తనాలు 40 కేజీల బ్యాగు 3110 రూపాయలు కు అందించనున్నట్లు తెలిపారు. కల్లూరు సొసైటీ లో 24 టన్నుల జీలుగులు, 125 బ్యాగులు జనములు విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. సబ్సిడీ విత్తనాలు కావలసిన రైతులు



పాసుపుస్తకం,ఆధార్కార్డు జిరాక్స్ కాపీలను తీసుకుని వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి కూపన్లు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చరల్ ఏవో మాదాబత్తుల రూప, కల్లూరుసొసైటీ ఉపాధ్యక్షులు రామిశెట్టి కొండలరావు, సొసైటీ డైరెక్టర్ కోలా వెంకటేశ్వరరావు, కృష్ణం శెట్టి నరసింహారావు, కల్లూరు , చిన్న కోరుకొండి సొసైటీ సీఈవోలు చప్పిడి యాలాద్రి, బీరవెల్లి శ్రీనివాసరావు , మున్సిపాలిటీ కౌన్సిలర్లు ఉబ్బన రాంబాబు, కాంగ్రెస్ యువ నాయకులు యాస శ్రీకాంత్, ధరావత్ రవికుమార్, మాజీ జెడ్పిటిసి మేకల కృష్ణ, పలువురు సొసైటీ డైరెక్టర్లు, ఏఈఓ లు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన రైతులు పాల్గొన్నారు.






# బీసీ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ప్రవేశాలు

**అన్నపురెడ్డిపల్లి మే 27 (జనంసాక్షి)**

అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల మహాత్మమ జ్యోతి బాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల డిగ్రీ బాలురు కళాశాలలో ఎటువంటి రాత పరీక్ష లేకుండా ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన బాలురు విద్యార్థులు నేరుగా డిగ్రీ కోర్స్ లో ప్రవేశం చేసేందుకు అవకాశం ఉందని కళాశాల ప్రసిపాల్ షేక్ బురాన్ అన్నారు.కళాశాలలో అడ్మిషన్లు కోసం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాల్లో ఆయన పర్యటించి విద్యార్థులకు డిగ్రీ కోర్స్ పై అవకాశాలను విద్యార్థులకు వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో బీఎస్సి ఎంపీసి, ఎంసిసిఎస్, బిజెడ్సి,బీకాం (కంప్యూటర్ అప్లికేషన్), బిఏ (హెచ్.పి.ఎస్) కోర్సులు ఉన్నాయి అని గతంలో కళాశాలలో చదువుకున్న విద్యార్థులు 80 శాతం పైగా ఉతీర్నత సాధించారు అని నైపుణ్యం కలిగిన అధ్యాపక బృందం వుందని అన్నారు. చదువుతో పాటు క్రీడ,స్కిల్ డెవలప్ మెంట్ నేర్పిం చడం జరుగుతుంది అని



కళాశాలలో చదువుకునే విద్యార్థులకు సన్న బియ్యంతో అన్నం మినరల్ వాటర్,వసతి సౌకర్యం విద్యార్థులు రక్షణ కోసం 24 గంటలు ఉపాధ్యులు అందుబాటులో ఉండటం అదేవిధంగా కళాశాల ప్రాంగణంలో 19 సీసీ కెమెరాలు నిఘా ఏర్పాటు చేయడం జరిగింది అని అన్నారు.గతంలో ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థులను తీసుకోవడం జరిగింది అని రాత పరీక్ష రాయని విద్యార్థులు ఈ నెల 29 వ తేదీ వరకు నేరుగా సర్టిఫికెట్లు తీసుకొని వచ్చి కళాశాలలో చేరవచ్చు అని అన్నారు.మరిన్ని వివరాలు కోసం ఫోన్ నెంబర్లు 9059490623, 9392540836, 99517348776, 955313588, 8500006021 సం ప్రదించాలని కోరారు.



## కిషోర బాలికల ఆరోగ్య అవగాహన కార్యక్రమం

**హుజూర్‌నగర్ మే 27 (జనంసాక్షి):**

హుజూర్ నగర్ పట్టణంలోని అంగన్వాడి కేంద్రం - 6 లో బుధవారం కిషోర బాలికల ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని డాక్టర్ నాగేందర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలకు ఆరోగ్య పరిరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, రక్తహీనత (అనీమియా) నివారణ, మహిళలు నెలసరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మానసిక ఆరోగ్యం గురించి అవగాహన కల్పించారు. కిషోర దశలో సరైన ఆహారం, ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రల వినియోగం, పరిశుభ్రమైన జీవనశైలి పాటించడం వల్ల ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మంగ, ఉపకేంద్ర ఆరోగ్య సిబ్బంది ఇందిరాల రామకృష్ణ, బండారు కవిత, ఉమా, శంకర్, అంగన్వాడీ టీచర్ గోవర్ధనీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రకృతి విపత్తు-ఈదురుగాలుల బీభత్సానికి

## నేలమట్టమైన బత్తాయి తోట

### కన్నీరుమున్నీరవుతున్న రైతు

ఇలాంటి ప్రకృతి విపత్తులు శాపంగా మారుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం మరియు ఉద్యానవన శాఖ అధికారులు వెంటనే స్పందించి, పాల్వాయి గ్రామంలో క్షేత్రస్థాయి పరిశీలన జరపాలని డిమాండ్ చేస్తున్నారు.నష్టపోయిన రైతు మల్లారెడ్డికి ప్రభుత్వం నుండి తక్షణమే భారీ నష్టపరిహారం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు, తోటి రైతులు కోరుతున్నారు.

## మానవ జీవనానికి యోగ ఎంతో శ్రేయస్కరం

**వలిగొండ, మే 27 (జనంసాక్షి )**

మండలంలోని గోకారం గ్రామంలో ఉచిత యోగ, మెడ టేషన్ సమ్మర్ క్యాంపులో విద్యార్థులు యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. యోగ శారీరక మానసిక దృఢ త్వానికి యోగ ఎంతో దోహదపడుతుందని తెలంగాణ పతాంజలి యోగా సమితి మండల అధ్యక్షులు రాధారపు మల్లేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లంగారు మురళి, విద్యార్థులు యువకులు పాల్గొన్నారు.





## నత్తనడకన కొనుగోలు రోడ్ ఎక్కిన రైతన్నలు

**వలిగొండ, మే 27 (జనంసాక్షి)**

మండలంలోని ఎదుళ్ళగూడెం గ్రామంలో గత కొన్ని రోజులుగా ధాన్యం కొనుగోలు నత్తనడకన సాగుతున్నాయని రైతన్నలు బుధవారం రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఇప్పటికీ దాదాపు 45 రోజులు కావస్తున్న నేటికి ధాన్యం కొనుగోలు సగం కూడా పూర్తికాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న తాసిల్దార్ దశరథ, ఎస్ఐ యుగేందర్ గౌడ్ ధర్నా వద్దకు చేరుకొని రైతులకు అవసరమైన లారీలను పంపించు కొనుగోలను త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో రైతన్నలు పాల్గొన్నారు.

## ఏ ఎన్ ఎం పోస్ట్ కు దరఖాస్తుల ఆహ్వానం

**దేవరకొండ, మే 27 (జనంసాక్షి):**




దేవరకొండ మండలంలోని పెంచికల్పహాడ్ లోని తెలంగాణ మోడల్ స్కూల్, హాస్టల్ లో ఏ ఎన్ ఎం పోస్ట్ కు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు స్థానిక ఎంఈఓ మాతృనాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతతో పాటు, ఏఎన్ఎం ధ్రువపత్రం కలిగి ఉన్న 18 నుంచి 44 ఏండ్ల వయసుగల అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఎస్సీ, ఎస్టి, బీసీ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు, దివ్యాంగులకు పదేళ్ల వయసు సడలింపు ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి,అర్హత కలిగిన అభ్యర్థులు మండలంలో మండల విద్యా వనరుల కేంద్రం (ఎం ఆర్ సి ) నందు ఈనెల 30వ తేదీలోపు అప్లికేషన్ మరియు జిరాక్స్ సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

### నాథుడు లేని ఇందుగుల గ్రామం ప్రజాప్రతినిధులు లేకపోవడంతో

# అధికారుల ఇష్టారాజ్యం

వల్ల నిత్యం వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించబోయి రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాలను ఢీకొట్టే పరిస్థితి నెలకొంది ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ స్తంభాలు కనిపించక ద్విచక్ర వాహనదారులు, ఆటోలు ప్రమాదాల బారిన పడుతున్నారు పెద్ద ప్రమాదం జరిగి ఏ అమాయకుడైనా ప్రాణాలు కోల్పోయాక గానీ మీ ఏసీ గదుల నిద్ర లేవదా? అని రహదారిపై ప్రయాణించే వాహనదారులు అధికారులను నిలదీస్తున్నారు పత్రికా కథనాలకు కూడా స్పందించకుండా ఇంత బరితెగింపుగా వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై ఉన్నతాధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు

**రాస్తారోకోకు గ్రామస్తుల సిద్ధం**

పత్రికల్లో వార్తలు వచ్చినా, స్థానికంగా నాయకత్వం లేకపోయినా ఇకపై తాము చూస్తూ ఊరుకోబోమని ఇందుగుల గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు అధికారుల కళ్లు తెరిపించాలంటే రోడ్డుపైనే ధర్నాలు, రాస్తారోకోలు చేయక తప్పదని స్పష్టం చేస్తున్నారు ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని, ఈ అవినీతి భాగోతంపై విచారణ జరపాలని, రోడ్డు మధ్యలో ఉన్న కరెంటు స్తంభాలను తక్షణమే యుద్ధప్రతిపాదికన తొలగించాలని, లేనిపక్షంలో ఆర్ అండ్ బీ, కరెంట్ ఆఫీసులను ముట్టడిస్తామని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు

**స్పందిస్తారా.. ఆందోళనలు చేపట్టమంటారా?**

గ్రామంలో సర్పంచ్ లేడనే చులకన భావంతోనే అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రజల పన్నుల డబ్బుతో రోడ్లు వేస్తూ, వారి ప్రాణాలనే బలితీసుకునేలా ప్రవర్తించడం దుర్మార్గమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేదంటే ఊరు ఊరంతా రోడ్డుపైకి వచ్చి ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.



# ఎండ వేడికి భవిష్యత్తులో మన జీవితం ప్రశ్నార్థకమే

○వ్యవసాయం, ఆరోగ్యం, పర్యావరణంపై తీవ్ర ప్రభావం..
○వడ దెబ్బకు ప్రాణాలు కోల్పోతున్న చిన్న పిల్లలు వృద్ధులు..
○కల్తీ ఆహారం, ప్లాస్టిక్ వాడకం తో ఆరోగ్య సమస్యలు..






**మణుగూరు, మే 27 (జనంసాక్షి):**
రోజురోజుకు పెరుగుతున్న ఎండ వేడికి భవిష్యత్తులో మన జీవితం అంధకారమే వ్యవసాయం, ఆరోగ్యం, పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపే స్థాయికి చేరుతోంది. శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం 2030 కి జనజీవనం స్తంభించి పోతుంది. ఇది కేవలం వాతావరణ మార్పు కాదు మనిషి భవిష్యత్తుపై ప్రభావం చూపే హెచ్చరిక.మనిషి చేసిన తప్పులకు ప్రకృతి ఇచ్చిన హెచ్చరిక. మే నెలలోనే 45?48 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతుంటే, రాబోయే సంవత్సరాల్లో పరిస్థితి ఏ స్థాయికి చేరుతుందో ఊహించడమే భయానకం.

**ఉష్ణోగ్రతలు ఇంకా పెరుగుతాయి;**
ప్రతి సంవత్సరం రికార్డు స్థాయిలో వేడి నమోద వుతుంది. వేసవి వచ్చిందనగానే ఏ కూలర్ కొనాలి..? ఏసి ఏది చల్లగా వస్తోంది.అనే భ్రమలో బ్రతుకుతున్నారే తప్ప ఇలా ఎందుకు జరుగుతుందనే ఆలోచన ఎవ్వరికీ లేకపోవడం మన దౌర్భాగ్యం.. ఏదైనా చివరి దశకు వస్తె తప్ప మనము కానీ మన ప్రజా ప్రతినిధులు,ప్రభుత్వాలు ముందుకు రారన్న విషయం అందరికీ తెలిసిందే.అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతోంది.రాత్రిపూట కూడా ఉష్ణోగ్రతలు ఎక్కువగానే ఉండటం వల్ల వడ దెబ్బకు చిన్న పెద్ద తేడా లేకుండా ఎంతో మంది ప్రాణాలు కోల్పో తున్నారు. ఇది ఇలానే కొనసాగితే రాబోయే రోజుల్లో భూగర్భ జలాలు తగ్గిపోతాయి చెరువులు, వాగులు ఎండిపోతాయి తాగునీటి కోసం పట్టణాలు?గ్రామాల మధ్య ఘర్షణలు పెరుగుతాయి. ప్రజలు చావు బతుకుల మధ్య బతుకు భారంగా మారుతోంది..

**వ్యవసాయం కుదేలవుతుంది:**
పంటలు ఎండిపోవడం దిగుబడి తగ్గడం రైతుల అప్పులు, ఆత్మహత్యల ప్రమాదం ఆహార ధరలు విపరీతంగా పెరుగుతాయి. ఇప్పటికే వ్యవసాయ అవశేషాలు తగలుపెట్టి భూసారాన్ని తగ్గిస్తున్నారు. రసాయనాలతో పంటలు పండించే వారు ఎక్కువ య్యారు. భూగర్భ జలాలు తగ్గిపోతాయి చెరువులు, వాగులు ఎండిపోతాయి నీరు లేక దిగుబడి తగ్గిపోతుంది.తృణ ధాన్యాలు పండించే వారు తగ్గి వ్యవసాయ రంగం కుదేలవుతుంది.మానవ మనుగడ కష్టతరంగా మారుతోంది.

**ఆరోగ్య సమస్యలు పెరుగుతాయి :**
రసాయనాలతో పండించే కూరగాయలు, పండ్లు తినటం వల్ల బయట దొరికే కల్తీ ఆహారం తీసుకోవడం, ప్లాస్టిక్ సంచుల్లో నిల్వ ఉంచిన వాటిని వాడటం వల్ల అనారోగ్యం. కర్మాగారాల్లో నుంచి వచ్చే పొగ వల్ల గుండె, ఊపిరితిత్తుల సమస్యలు వృద్ధులు, చిన్న పిల్లలు ఎక్కువగా ప్రభావితులవుతున్నారు. లోపల బయట పనిచేసే కార్మికులకు ప్రాణాపాయం ఎక్కువగా ఉందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మినరల్ వాటర్, ప్లాస్టిక్ బాటిల్లో కెమికల్ కలిపిన నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉంచిన వాటిని వాడటం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది.

**మనం ఇప్పుడే చేయాల్సినవి:**
ఒక మనిషి కనీసం 10 చెట్లు నాటడం,నీటి పొదుపుగా వాడాలి.వృధా నీటి కోసం ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి.ప్లాస్టిక్ వినియోగం తగ్గించి గాజు సీసాల్లో ఆహార పదార్థాలను నిల్వ చేసుకోవాలి.సౌర విద్యుత్ వినియోగం పెంచాలి.పర్యావరణాన్ని కాపాడాలి ఇప్పుడే మారకపోతే, రేపు మన పిల్లలకు నీరు, గాలి, జీవితం అన్నీ ప్రశ్నార్థకం. ప్రభుత్వాలు తాత్కాలిక చర్యలకే పరిమితం కావడం సరికాదు.ఫోటో కోసం కాదు జీవితం కోసం పనిచేయాలి. నీటి సంరక్షణ, చెట్ల పెంపకం, పచ్చదనం పరిశుభ్రత ఇవి నినాదాలు కాదు, అత్యవసర విధానాలు కాగితాలకే పరిమితం కాకుండా గ్రామ పట్టణ స్థాయిలో ప్రవేటు కంపెనీలు, ప్రభుత్వ సంస్థల్లో,పాఠశాల, కళాశాల, రహదారికి ఇరువైపుల చెట్లు నాటి వాటి సంరక్షణ కూడా మన బాధ్యతగా చేస్తే తప్ప ఈ విపత్తు నుంచి బయట పడలేమని నిపుణులు చెబుతున్నారు.
ప్రతి ఒక్కరూ నాకెందుకులే ఎవరో ఒకరు చేస్తారనే ఆలోచనతో వదిలేస్తే భవిష్యత్తులో మనకు మన కుటుంబానికి నష్టం జరుగుతోంది. దీనికితోడు అడవుల్లో మంటల పెట్టడం వల్ల పచ్చని గడ్డి మొలిచేదెలా పక్షులు, జంతువులు నీరు లేక చనిపోయి జీవ వైవిధ్యం నాశనం. భూభాగం ఎడారులా మారడం,పంట పొలాలు బీటలు పడటంతో గ్రామీణ ప్రాంతాల్లో ఆహార కొరత ఏర్పడుతోంది.సిమెంట్, రోడ్ల వల్ల నగరాల్లో జీవితం కష్టమవుతుంది.ప్లాస్టిక్ లో నిల్వ ఉంచిన నీరు, ఆహారపదార్థాలు తీసుకోవడం వల్ల ప్రాణానికి ముప్పు కలుగుతోంది.

## బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎంపీ నామ



**ఖమ్మం కార్పొరేషన్, మే 27(జనంసాక్షి)**
త్యాగం, సేవా భావానికి ప్రతీకగా బక్రీద్ పండుగ నిలుస్తుందని బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ పవిత్ర పండుగ సమాజంలో సోదరభావం, ప్రేమ, శాంతి సామరస్యా లను మరింత పెంపొందిం చాలని తెలిపారు. ప్రతి కుటుంబంలో సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చిందని ఆయన తెలిపారు. పేద ముస్లిం యువతుల వివాహాలకు షాదీ ముబారక్ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందించడంతో పాటు, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల ద్వారా నాణ్యమైన విద్యను అందించిందన్నారు. విదేశీ విద్య పథకం ద్వారా ఉన్నత చదువులకు అవకాశాలు కల్పిం చడంతో పాటు మసీదులు, ఖబర్‌స్థాన్‌ల అభివృద్ధికి నిధులు కేటాయించిందని పేర్కొన్నారు. తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలు సమానత్వంతో జీవించేలా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేసిందని నామ తెలిపారు. మత సామరస్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

## రైతులఆనందమే నా ఆనందం ఎమ్మెల్యే కుంభం



**వలిగొండ, మే 27 (జనంసాక్షి )**
రైతుల కళ్ళల్లో ఆనందమే నా ఆనందమని ఎట్టి పరిస్థితుల్లో రైతులకు ఇబ్బంది కలగ కూడదని ప్రతి ధాన్యం గింజ కొంటామని ఈసారి కొంత పంట దిగుబడి ఎక్కువ రావడం వలన రైస్ మిల్లుల వద్ద హమాలీల కొరత లారీల కొరత వలన కొంత ఇబ్బంది కలిగిన ప్రతి రైతు పండించిన పంటను చివరి గింజ వరకు కొంటామని భువనగిరి ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని ఎదుళ్ళగూడెం వరి ధాన్యం సెంటర్లో ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ రైతులతో మాట్లాడి వారికి ధైర్యం ఇచ్చాడు వారి వెంట చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి ,తహసిల్దార్ దశరథ్ ,ఎస్సై యుగంధర్, వివిధ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నీకోసం నేను వస్తా

## పండుటాకులు కోసం పంచాయితీ కార్యదర్శి సురేష్




**అన్నపురెడ్డిపల్లి మే 27 (జనంసాక్షి)**
అధికారం,హోదా వచ్చిన తరువాత కొంత మంది రాజకీయ నాయకులు కానీ అధికారులు కానీ వారి స్థాయిని మర్చిపోయి ఎంతో గర్వంగా ఉంటారు కొంత మంది.ఉద్యోగం వచ్చిన తరువాత వారి ఉద్యోగం సమయం మించి ఒక్క నిమిషం కూడా ప్రజలకు అందుబాటులో ఉండరు.కానీ మండలంలో నర్సాపురం (రాజపురం) పంచాయితీ కార్యదర్శి వాటన్నింటికి బిన్నంగా ఉంటు ఎక్కడ సమస్య వున్న గ్రామంలో వెంటనే గుర్తించి పరస్కరిస్తున్నారు. మరో అడుగు ముందుకు వేసి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్ని రకాల పింఛన్ లబ్ధిదారులతో ఈకేవైసీ చేయించాలి అనడంతో గ్రామంలో 85 శాతం ఈజీవైసీ పూర్తి చేశారు.నడవలేని వృద్ధులు, వికలాంగులు ఇంటికి నేరుగా పంచాయితీ కార్యదర్శి సురేష్ నడుచుకుంటూ లబ్ధిదారులు ఇంటికి వెళ్ళి ఈకెవైసీ చేస్తున్నారు.దీనితో పింఛన్ లబ్ధిదారులు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.కొంత మంది కనురెప్పలు తీసుకోకపోవడంతో ముఖ ప్రామాణికరణ ద్వారా చేయడం కొంత మంది వేలు ముద్రలు సేకరణ ద్వారా నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరగకుండా పంచాయితీ కార్యదర్శి సురేష్ ఎంతో శ్రమిస్తున్నారు అని వృద్ధులు, వితంతువులు, వికలాంగులు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

## వెహికల్ లిఫ్టర్‌ను ప్రారంభించిన పోలీస్ కమిషనర్



**ఖమ్మం కార్పొరేషన్ మే 27 (జనంసాక్షి)**
పోలీసు వాహనాల నిర్వహణను మెరుగుపరచడానికి, మరమ్మతులను వేగవంతం చేయడానికి యంటి సెక్షన్ వర్క్ షాప్‌లో ఏర్పాటు చేసినహైడ్రాలిక్, ఎలక్ట్రో – మెకానికల్ వెహికల్ లిఫ్టర్‌ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ప్రారంభించారు. పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు నిరంతరం రోడ్లపై తిరగడం వల్ల వచ్చే వాహన మరమ్మతుల కోసం మెకానిక్ వర్క్ షాప్ లలో గంటల తరబడి కాకుండా నిమిషాల్లో సిద్ధమయ్యే విధంగా వెహికల్ లిఫ్టర్లు కీలక పాత్ర పోషిస్తాయని పోలీస్ కమిషనర్ తెలిపారు. దీనివల్ల పోలీస్ శాఖ వాహనాల జీవితకాలం పెరగడమే కాకుండా, నిర్వహణ ఖర్చులు తగ్గుతాయన్నారు.కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (ఏఆర్) కుమారస్వామి, ఏఆర్ ఏసీపీ లు సుశీల్ సింగ్, నర్సయ్య, ఆర్ ఐ లు కామరాజు, శ్రీశైలం, సురేష్, నాగుల్ మీరా పాల్గొన్నారు.

# త్యాగానికి ప్రతిరూపం బక్రీదు

## ఐదువేల ఏళ్ల నాటి ఇబ్రాహీం ప్రవక్త మహోన్నత చరిత్ర




- **నమ్రూద్ చక్రవర్తి గర్వభంగం : అగ్నిగుండంలో పూలపాన్పు**
- **నిర్జన ఎడారిలో దైవపరీక్ష:తల్లి హాజిరా, పసిబిడ్డ ఇస్మాయిల్ ఆవేదన**
- **ఎడారిలో ఉబికిన అమృతం:పవిత్ర 'జమ్ జమ్' జలధార పుట్టుక**
- **కన్నకొడుకునే బలిచ్చే పరమోన్నత త్యాగం:నిబద్ధతకు నిదర్శనం 'ఖుర్బానీ'**
- **ప్రపంచ ముస్లిముల కేంద్రం: తండ్రీకొడుకులు నిర్మించిన పవిత్ర 'కాబా' గృహం**
- **హజ్ యాత్ర ఇబ్రాహీం ప్రవక్త కుటుంబ జ్ఞాపకాల సజీవ సాక్ష్యం**



**ఖమ్మం కార్పొరేషన్, మే 27 (జనంసాక్షి)**
త్యాగాలకు చిహ్నంగా ముస్లిములు ఏటా బక్రీదు పర్వదినాన్ని జరుపుకుంటారు. హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాం జీవితం బాల్యం నుండి వ ?ద్ధాప్యం వరకు అడుగడుగునా ఎన్నో పరీక్షలు ఎదుర్కొన్నారు. మరెన్నో త్యాగాలు చేశారు. పుత్రునిగా, భర్తగా, తండ్రిగా, ప్రవక్తగా, విశ్వాసపాత్రుడైన దైవదాసుడుగా ఆయన తన కర్తవ్య నిర్వహణలో ఎన్నడూ వెనుకంజ వేయలేదు. దేవుడు పెట్టిన ప్రతీ పరీక్షలోనూ నెగ్గారు.
సరిగ్గా ఐదువేల సంవత్సరాల క్రితం ఇప్పుడు మనం ఇరాక్ గా పిలుచుకుంటున్న ప్రాంతాన్ని నమ్రూద్ చక్రవర్తి పరిపాలించేవాడు. తన దుర్మార్గపు నిర్ణయాలతో ప్రజలు నానా తంటాలు పడేవారు. తానే దేవుడిగా చెలామణి అయ్యేవాడు. గర్వించేవాడు. నమ్రూద్ దుర్మార్గ పాలనకు చెరమగీతం పాడాలని ఇబ్రాహీం ప్రవక్త గళం విప్పారు. సమాజంలో పాతుకుపోయి ఉన్న దురాచారాలను, విగ్రహారాధనను వ్యతిరేకించారు. సర్వ సృష్టిని స ?ష్టించిన ఒకే ఒక్క దైవాన్ని ఆరాధించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. దీంతో ఆగ్రహించిన రాజు భగభగ మండే అగ్నిగుండంలో ఇబ్రాహీం (అ)ని పడవేయించాడు. కాని దైవ మహాత్యంతో అగ్నిగుండం పూలపాన్పుగా మారింది. ఈ విషయం తెలుసుకున్న రాజు తన దైవత్వానికి ప్రమాదం పొంచి ఉందని భయపడ్డాడు. ఇబ్రాహీం ను రాజభవనానికి పిలిపించి తీవ్రంగా హెచ్చరించాడు. "నువ్వు ప్రజల్లో అలజడి సృష్టిస్తున్నావు. నన్ను మించిన దేవుడెవడూ లేడు" అన్నాడు నమ్రూదు. దానికి ఇబ్రాహీం జవాబిస్తూ "జీవన్మరణాలు ప్రసాదించేవాడే నా ప్రభువు. ఆయనే ఈ సమస్త సృష్టికి స ?ష్టికర్త" అన్నారు. ఈ మాటలు విన్న నమ్రూద్ తన గొప్పదనాన్ని చూపించడానికి "నేను కూడా జీవితాన్ని ప్రసాదిస్తాను. నేను తలచిన వారిని చంపించగలను. కాబట్టి న ప్రభువు చేసే పని ప్రత్యేకమైనదేం కాదు." అన్నాడు. ఇబ్రాహీం నవ్వుతూ .. "నా ప్రభువు సూర్యుడిని తూర్పు నుంచి ఉదయించేలా చేస్తున్నాడు. పడమట అస్తమించేలా చేస్తున్నాడు. నువ్వే గనక దేవుడివి అయితే ఈ క్రమాన్ని మార్చి చూపించు" అన్నారు. ఇబ్రాహీం మాటలకు నమ్రూద్ నోరెళ్లబెట్టాడు. అందరిముందూ సిగ్గుతూ తలదించుకున్నాడు. అక్కడి నుంచి ఇబ్రాహీం వేరే ప్రాంతానికి వెళ్లిపోయారు. మరోపక్క ఇంటి వారినుంచి కూడా ప్రతిఘటన ఎదురైంది. తాతముత్తాతలనాటి దురాచారాలను వదిలేయమన్నందుకు ఇబ్రాహీం తండ్రి ఆజర్ ఇబ్రాహీం ను ఇంటినుంచి గెంటివేశారు. యుక్తవయస్సులోనే ఇంటిని, దేశాన్ని వదిలి వెళ్లిపోవాల్సి వచ్చింది. వయసు పై బడుతున్న కొద్దీ తన తదనంతరం దైవ సందేశ కార్యభారాన్ని నిర్వర్తించడానికి సంతానం ఉంటే బాగుండునన్న కోరిక కలిగేది. దైవం పండంటి బిడ్డను ప్రసాదించాడు. లేకలేక కలిగిన బిడ్డనుచూసుకొని ఆ దంపతులు ఎంతగానో మురిసి పోయారు. అల్లారు ముద్దుగా పెంచుకోసాగారు. ఆ సంతోషం ఎంతోకాలం నిలవలేదు. దేవుడాయనకు మరో పరీక్ష పెట్టాడు. భార్యను, కొడుకును జనసంచారం లేని ఎడారి ప్రాంతంలో వదిలేసిరమ్మని ఆదేశించాడు. ఇబ్రాహీం (అస) తన భార్యకు కొన్ని ఎండు ఫలాలు, కొంత నీరు, మరికొన్ని వస్తువులు జనసంచారంలోని ఎడారి ప్రాంతంలో వదిలి తీవ్ర విచారంతో వెనుదిరిగారు. భార్య ఒంటెను పట్టుకుని "ఇబ్రాహీమ్! మమ్మల్ని ఈ నిర్జన ప్రదేశంలో ఎందుకు వదిలేస్తున్నారు? "మీకు నా పట్ల ఎలాంటి అభిమానం లేకపోయినా కనీసం మీ కన్న బిడ్డ గురించి ఆలోచించండి. మీ కుమారుడు ఇక్కడ ఆకలి దప్పులతో ప్రాణం వదిలివేయవచ్చు. ఇక్కడ క్రూర మృగాలు మాపై దాడి చేయవచ్చు" అని భర్తకు మొరపెట్టుకున్నరు. భర్త ఇబ్రాహీం సహనం వహించాలని ఆమెతో చెప్పారు. 'తాను, తన ఇష్టప్రకారం వ్యవహరించడం లేదనీ, కేవలం అల్లాప్? ఆదేశాలను అమలు చేస్తున్నామనీ జవాబిచ్చారు. ఆయన జవాబు ఆమెకు ఊరటకలిగించింది. "ఇది అల్లాప్? అభీష్టమైతే ఆయన మమ్మల్ని ఒంటరిగా వదలిపెట్టడు" అని హాజిరా తన్ను తాను ఓదార్చుకున్నారు. తన భార్యాబిడ్డల్ని జనసంచారంలేని ఎడారిలో వదిలి వెళుతున్నందుకు ఇబ్రాహీంలో దుఖాన్ని భరించలేకపోయారు. కళ్లనిండా అశ్రువులతో, బరువెక్కిన గుండెతో తిరుగుప్రయాణమయ్యారు. "ప్రభూ!నీ పవిత్రమైన గృహానికి దగ్గరగా నిర్జన ప్రదేశంలో నేనూ నా కుటుంబీకులను వదలి వచ్చాను. వారు అక్కడ దైవారాధనను స్థాపించాలని భావిస్తున్నాను. వారిపట్ల సానుభూతి, ఆదరాభిమానాలను ప్రజల్లో కలిగించు. వారికి సకల సదుపాయాలను కలిగించు" అని అల్లాప్? కు మొరపెట్టుకున్నారు.
కొన్ని రోజులు వెంటతెచ్చుకున్న అన్నపానీయాలు అయిపోయాయి. పసిబిడ్డతో సహా హాజిరా ఆకలిదప్పులతో అలమటించసాగారు. బిడ్డకు పాలుపట్టడానికి రొమ్ముల్లో సైతం పాలు ఇంకిపోయాయి. పసిబిడ్డ ఆకలితో దయనీయంగా గుక్కపట్టి ఏడుస్తున్నాడు. పసిబిడ్డ ఏడుపు చూసి హాజిరా కన్నీరుమున్నీరయ్యారు. బిడ్డను అక్కడే నేలమీద పడుకోబెట్టి నీటికోసం, ఆహారం కోసం వెదుకుతూ అటూఇటూ తిరగసాగారు. సఫా అనే పేరుగల కొండను ఇక్కి లోయమొత్తం చుక్కనీటికోసం ఆశగా వెదికారు. నీటి జాడలేదు. మరోదిక్కున ఉన్న మర్వా కొండపైకి ఎక్కి చూశారు. ఇలా రెండు కొండల మధ్య ఏడుసార్లు తిరిగారు. నిరాశగా పసిబిడ్డ వద్దకు వచ్చారు. బిడ్డ పరిస్థితి దయనీయంగా ఉంది. "ఓ అల్లాప్? కరుణించు" అని వేడుకున్నారు. పసి బిడ్డ ఇస్మాయిల్ ఆకలి బాధతో ఏడుస్తూ తన కాళ్లతో నేలను కొడుతున్న ప్రదేశంలో స్వచ్ఛమైన నీటి ఊట అకస్మాత్తుగా ఉబికి వచ్చింది. తల్లి హాజిరా ఆ స్వచ్ఛమైన నీటిని బిడ్డ నోటిలో పోశారు. బిడ్డ ఏడుపు ఆగింది. క ?తజ్ఞతతో ఆమె మనసు ఉప్పొంగిపోయింది. ఐదువేల సంవత్సరాలక్రితం నాటి జలధార నేటికీ ప్రవహిస్తూనే ఉంది. అదే పవిత్రజలం 'జమ్ జమ్'. ఆ ఆనాడు వెలసిన 'జమ్ జమ్' ఊట నేటికీ కోట్లాది ప్రజల అవసరాలు తీరుస్తూంది. ఈ నీరు నిల్వ ఉంచినా చెడిపోదు. హజ్ యాత్రకు వచ్చిన వారు తమ తమ దేశాలకు ముస్లిములు మక్కా నుంచి ఈ నీరు తీసుకువెళు తుంటారు. ఆనాటి ఆ నిర్జనఎడారి ప్రాంతమే ఈనాడు సుందర మక్కా నగరం.
ఆ తరువాత కొంత కాలానికి దైవాదేశం మేరకు ఇబ్రాహీం మక్కా తిరిగొచ్చి భార్యా బిడ్డల్ని కలుసుకున్నారు. తనయుడు చిన్నారి ఇస్మాయిల్‌తో కలసి కాబా గృహాన్ని నిర్మించారు. తరువాత ఆయనకు మరో పరీక్ష ఎదురైంది. ఐతే ఇది మామూలు పరీక్ష కాదు. మానవ చరిత్ర కనీవిని ఎరుగని పరీక్ష. ఈసారి దైవం ఏకంగా కన్నకొడుకునే బలి చెయ్యమని కలలో ఆదేశించాడు. దివ్యఖుర్ఆన్ లో ఇబ్రాహీం త్యాగనిరతిని అల్లాప్? ప్రస్తావించాడు.
"మేము అతనికి ఒక సహనశీలుడ్కెన కుమారుడు కలుగుతాడనే శుభవార్తను అందజేశాము. ఆ బాలుడు అతనికి తోడుగా పనిచేసే వయస్సుకు చేరుకున్నప్పుడు (ఒకనాడు) ఇబ్రాహీమ్ అతనితో ఇలా అన్నాడు: "కుమారా! నేను నిన్ను 'జిబప్?' (బలి) చేస్తున్నట్లుగా కలలో చూశాను. ఇక నీ అభిప్రాయమేమిటో చెప్పు."
కొడుకు ఇస్మాయిల్ కూడా తండ్రికి తగ్గ తనయులు. దేవుడు కలలో చూపించిన ఆదేశాన్ని అమలు చేయాలని కొడుకు ఇస్మాయిల్ తండ్రికి ఎంతో నిబ్బరంగా చెప్పారు. ఇస్మాయిల్ తన దుస్తులు తొలగించారు. తల్లికి సలాములు చెప్పాలని చెప్పాలని తండ్రిని కోరారు. తన గుర్తుగా ఈ దుస్తులు తల్లికి ఇవ్వాలని చెప్పారు. బలిచ్చేటప్పుడు తన కాళ్లు చేతులు కట్టేయాలని చెప్పారు. ఇబ్రాహీం (అ) తన కత్తిని పదును పెట్టారు. కుమారుడిని గట్టిగా కౌగిలించుకుని రోదించారు. ఇస్మాయిల్ ను పడుకోబెట్టి కాళ్లూ చేతులు కట్టేశారు. బరువెక్కిన హ ?దయంతో కత్తిని లేపారు. పసి ఇస్మాయిల్ గొంతుపై కత్తి వేటు వేశారు. కానీ ఆ కత్తి గొంతును కోయలేదు. కత్తిని గట్టిగా కోయాలని ఇస్మాయిల్ అరుస్తూ చెప్పారు. ఇబ్రాహీం (అలై) అలాగే చేశారు. అయినా కత్తి గొంతును కోయలేదు. ఇబ్రాహీం ఆశ్చర్యపోయారు. "ఇబ్రాహీం నీవు కలను నిజం చేసి చూపించావు.మేము నీ విధేయతకు బహుమానం ప్రసాదిస్తున్నాము." అన్నాడు అల్లాప్?. అల్లాప్? కు కావలసింది బలికాదు. ఆయన నిబద్ధతనే పరీక్షించదలిచాడు. ఇస్మాయిల్ కు బదులుగా బలివ్వడానికి స్వర్గంనుంచి పొట్టేలును పంపించాడు అల్లాప్?. పొట్టేలును బలిచ్చారు. ఈ త్యాగానికి ప్రతీకగానే బక్రీదు పండుగను ముస్లిములు ఏటా జరుపుకుంటారు. ఆ నాడు ఆ తండ్రీకొడుకులు చేసిన త్యాగాన్ని స్మరిస్తూ నేడు ముస్లిములు ఖుర్బానీ ఇస్తుంటారు. నాడు వారిద్దరు తమ సర్వస్వాన్ని త్యాగం చేశారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దైవమార్గంలో పణంగా పెట్టారు. అలా ఖుర్బానీ ఇచ్చిన మాంసాన్ని పేదలకు పంచిపెడతారు. ఆ విధంగా పేదసాదలకు మాంసాహారం లభిస్తుంది.

**కాబా నిర్మాణం..**
ఇబ్రాహీం తన కుమారుణ్ణి చూసి చాలాకాలమయ్యింది. ఈసారి ఆయన అతి ముఖ్యమైన పని చేయవలసి ఉంది. ప్రపంచంలో మొట్టమొదటి ఆరాధనాలయాన్ని నిర్మించవలసిందిగా అల్లాప్? ఆయన్ను ఆజ్ఞాపించాడు. మక్కా లోయలో ఈ ఆరాధనాలయం ప్రాచీన కాలంలో ఉండేది. అక్కడ జమ్ జమ్ బావి వద్ద తన కుమారుడు ఇస్మాయిల్ (అలై) బాణాలకు పదును పెట్టడాన్ని చూశారు. తండ్రీకొడుకులు ఒకరినొకరు చూసుకొని ఆనందంతో కౌగిలించుకున్నారు. అల్లాప్? కాబా గృహాన్ని నిర్మించాలనే అల్లాప్? ఆదేశాన్ని ఇబ్రాహీం తన కుమారుడికి చెప్పారు. ఇరువురూ కలిసి కాబా గృహం పునాదులను త్రవ్వసాగారు. ఇస్మాయిల్ రాళ్లను మోసుకుని వస్తుంటే ఇబ్రాహీమ్ వాటిని అమర్చసాగారు. కొంతకాలానికి నిర్మాణం రూపురేఖలు దిద్దుకుంది. ఆ విధంగా కాబాగృహం నిర్మించబడిరది. ఐదువేల సంవత్సరాలక్రితం ఇబ్రాహీం ప్రవక్త నిర్మించిన కాబా గృహం ప్రపంచ ముస్లిములకు పవిత్రమైన గృహంగా, ఆరాధనాలయంగా కొనసాగుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లిములు ఏ మూలన ఉన్నా కాబాగ ?హం వైపునకు తిరిగే నమాజు చేస్తారు. దాన్నే ఖిబ్లా అని అంటారు. హజ్ యాత్రలోని క్రతువులో భాగమైంది. ఏటా ముస్లిములు మక్కాలోని కాబాగృహాన్ని సందర్శించి ప్రదక్షిణలు చేయడం హజ్‌లో భాగమైపోయింది. అమ్మ హాజిరా (అలై) సఫా-మర్వా కొండల నడుమ మంచినీటికోసం ఏడు సార్లు ఎలా తిరిగారో అలా తిరగడమూ హజ్ యాత్రలో భాగమైంది. ఈ కాబా పుణ్యక్షేత్రంతో ఇబ్రాహీమ్ జ్ఞాపకాలు ముడిపడి ఉన్నాయి. ఇక్కడ ఇబ్రాహీం నిలబడి నమాజ్ చేసిన చోటు ఉంది. ఖర్బానీ ఇచ్చిన ప్రదేశం ఉంది. ఇబ్రాహీం, ఇస్మాయిల్ త్యాగనిరతికి జ్ఞాపికగా ఇక్కడ జంతుబలిచ్చి పేదలకు తినిపించాలి.

# సీఎం రేవంత్ రెడ్డి చారిత్రాత్మక నిర్ణయంపై హర్షం

## సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి



కొండమల్లేపల్లి, మే 27 (జనంసాక్షి): తెలంగాణలోని గ్రామపంచాయతీల బలోపేతం ఆర్థిక పరిపుష్టి ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సరికొత్త నిర్ణయంతో గ్రామీణ ప్రాంతాలకు శుభవార్త చెప్పారు. పల్లెల వికాసమే లక్ష్యంగా అడుగులు వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు పూర్తిస్థాయి ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించే దిశగా అడుగులు వేస్తోందని గ్రామ పంచాయతీలకు వచ్చే సొంత ఆదాయాన్ని ప్రభుత్వ ట్రెజరీ ఖాతాల్లో కాకుండా నేరుగా ఆయా పంచాయతీల సొంత బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసుకునేలా తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టంలో తగిన మార్పులు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించడంపై కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత విధానం ప్రకారం గ్రామపంచాయతీలకు పన్నులు ఇతర వనరుల ద్వారా వచ్చే సొంత ఆదాయాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం ట్రెజరీ ఖాతాల్లో జమ చేయాల్సి వచ్చేదని దీనివల్ల గ్రామాల్లో అత్యవసర పనులు చేపట్టాలన్నా పారిశుద్ధ్య కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వాలన్నా వీధి దీపాల నిర్వహణ చూసుకోవాలన్నా నిధుల విడుదల కోసం సర్పంచులు ట్రెజరీల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ప్రభుత్వ అనుమతులతో పాటు సాంకేతిక కారణాల వల్ల నిధులు డ్రా చేయడంలో తీవ్ర జాప్యం జరిగేదని గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడేదన్నారు. ఈ ఇబ్బందులను గమనించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్ తెచ్చిన పాత వ్యవస్థకు స్వస్తి పలికారు. ఈ నూతన విధానం అమల్లోకి వస్తే గ్రామాల్లో వసూలయ్యే ఆస్తి పన్నులు, నల్లా ఫీజులు, లేఅవుట్ ఫీజులు ఇతర రూపాల్లో వచ్చే సొంత ఆదాయం నేరుగా పంచాయతీల స్థానిక బ్యాంకు ఖాతాల్లోనే ఉంటాయన్నారు. దీనివల్ల నిధుల వినియోగంలో సర్పంచులకు, పంచాయతీ పాలకవర్గానికి పూర్తి స్వేచ్ఛ లభిస్తుందని తెలిపారు. ట్రెజరీలతో సంబంధం లేకుండా నేరుగా గ్రామ అవసరాలకు తక్షణమే డబ్బులను డ్రా చేసుకునే వీలుంటుందన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయంపై కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో నిధుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే తిప్పలు తప్పుతాయని ఆనందం వ్యక్తం చేశారు.



## బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

నల్లగొండ (ప్రతినిధి, మే 27,(జనంసాక్షి): బక్రీద్( 'ఈద్-ఉల్-అజ్హా') పండుగ సందర్భంగా రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలంగాణ రాష్ట్రంలోని ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ప్రవక్త ఇబ్రహీం అలైహిస్సలాం త్యాగం, విశ్వాసం, మానవతా విలువలను స్మరించుకుంటూ జరుపుకునే బక్రీద్ పండుగ సమాజానికి ఐక్యత, సహనం, పరస్పర ప్రేమాభిమానాల సందేశాన్ని అందిస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.ఈ పవిత్ర పండుగ ప్రతి కుటుంబంలో ఆనందం, శాంతి, సౌభాగ్యాలను నింపాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని ప్రార్థిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

# బాల్య వివాహాలు అరికట్టాలి



హాలియా మే 27జనంసాక్షి హాలియా మునిసిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో తెలంగాణ ప్రభుత్వ ప్రాతిష్టికమైన "ప్రజాపాలన పట్టణ ప్రణాళిక ? 99 రోజుల కార్యక్రమం" బాల్య వివాహాల పై అవగాహనా కార్యక్రమం ఈరోజు విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో 1, 2, 3 మరియు 9వ వార్డుల ప్రజలు భాగస్వామ్యంగా పాల్గొన్నారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా 2వ వార్డు కౌన్సిలర్ నకిరేకంటి అన్నపూర్ణ సాయి మరియు 9వ వార్డు కౌన్సిలర్ చెరువుపల్లి ముత్యాలు గార్లు హాజరై ఉంటూ మాట్లాడారు. వారు బాల్య వివాహాలు పిల్లల భవిష్యత్తును, వారి విద్యా హక్కులను మరియు ఆరోగ్యాన్ని నాశనం చేస్తాయని, శారీరకంగా మరియు మానసికంగా తీవ్రమైన దుష్ప్రభావాలు ఉంటాయని గాఢంగా హెచ్చరించారు. చిన్న వయసులో వివాహం వల్ల అమ్మాయిల విద్య ఆపరైపోవడం, గర్భధారణ సంబంధిత ఆరోగ్య సమస్యలు పెరగడం, మరియు ఆ పరిస్థితులు వారిని పేదరికంలో నిలిపివేసే అవకాశాలును వారు వివరించారు.కౌన్సర్లు స్థానికులకు చట్టబద్ధమైన వయస్సు విషయాన్ని స్పష్టం చేశారు: మహిళలు కనీసం 18 సంవత్సరాలు పూర్తి చేయకముందే వివాహం జరపకూడదని, పురుషులు కనీసం 21 సంవత్సరాలు పూర్తి చేయకముందే వివాహం జరపకూడదని గుర్తుచేశారు. చట్టవిరుద్ధమైన కార్యకలాపాలను ప్రోత్సహించే ఎలాంటి పెళుసు, యోజనలేవో అందువల్లా చర్య చేయరాదు కూడా వారు సూచించారు. కార్యక్రమంలో మురళి అయ్యగారు, సత్యనారాయణ రాజు, ఆంగన్వాడీ టీచర్లు, వార్డ్ ఆఫీసర్లు, బుక్ కీపర్లు, ఆశా వర్కర్లు, ఆయాలు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



# స్వామివారికి లక్ష పుష్పార్చన

యాదగిరిగుట్ట మే 27 (జనంసాక్షి) ఏకాదశి పర్వదినం సందర్భంగా యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహుడికి లక్ష పుష్పార్చన ఘనంగా నిర్వహించారు ఆలయ అర్చకులు. ప్రధానాలయం లోని ముఖమండపంలో నయన మనోహరంగా అలంకరించిన ఉత్సవ మూర్తులకు వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ సహస్రనామాలతో లక్ష పుష్పార్చన అత్యంత వైభవంగా చేపట్టారు. వివిధ రకాల పుష్పాలతో లక్ష పుష్పార్చన కన్నుల పండుగగా చేపట్టారు. లక్ష పుష్పార్చన విశిష్టతను భక్తులకు తెలియజేసారు ఆలయ అర్చకులు. లక్ష పుష్పార్చనలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు భక్తులు.

## త్యాగానికి ప్రతీక 'బక్రీద్'

### ముస్లిం సోదరసోదరీమణులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన రమావత్ రవీంద్ర కుమార్దేవరకొండ మాజీ శాసనసభ్యులు

దేవరకొండ, మే 27(జనంసాక్షి ) భక్తికి, త్యాగానికి, సహనానికి బక్రీద్ పండుగ ప్రతీక అని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పేర్కొన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరసోదరీ మణులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. భక్తి, శ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపుకోవాలని సూచించారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ ముస్లింలు బక్రీద్ పండుగను జరుపుకుంటారని అన్నారు. పేదల పట్ల జాలి, దయ కలిగి ఉండటమే బక్రీద్ ఇచ్చే సందేశమన్నారు. అల్లాహ్ ఆశీస్సులు ప్రజలందరికీ ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

## ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తహసిల్దార్ కు వినతి..



కనగల్లు, మే 27 (జనంసాక్షి) కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయములో ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని బిజెపి పార్టీ ఆధ్వర్యంలో తహసిల్దార్ పద్మకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీరెల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో 6 గ్యారంటీలు 420 హామీలతో ప్రజల ఓట్లను దండుకొని గద్దెనెక్కి అధికారములోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి పాలన చేస్తుందన్నారు. అరుహులైన వారందరికీ పింఛన్లు, ఆంక్షలు లేని రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, నిరుద్యోగ భృతి, గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పన, పెండింగ్ లో ఉన్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కొత్తగా పట్టా చేసుకున్న రైతులకు వెంటనే పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిండి పాపిరెడ్డి, బిక్షం, పంతంగి సైదులు, దాసరి వెంకన్న, నీలకంఠ వెంకన్న, తిరందాసు కనకయ్య, పల్లెగోని సైదులు, బొమ్మ పాల గణేష్ తదితరులున్నారు.

# నేలను పరిరక్షించండి: పంట వ్యర్థాలు కాల్చవద్దని వ్యవసాయ శాఖ పిలుపు



హాలియా మే 27 జనంసాక్షి : రైతులు పంట అవశేషాలను తగలబెట్ట కుండా భూమిలో కలియ దున్నుకోవాలని వ్యవసాయ అధికారి ఏం సరిత ఎం ఎంకన్న పిలుపునిచ్చారు బుధవారం అనుముల మండలంలో రైతులను ఉద్దేశించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూఓ. ఇలాంటి ప్రక్రియ ద్వారా అవశేషాలు సేంద్రీయ ఎరువుగా మారి నేలలో కార్బన్ శాతాన్ని పెంచి, పంట దిగు బడులపై సానుకూల ప్రభావం చూపుతాయని వారు వివరించారు. పంటఅవశేషాలను కాల్చడం వల్ల కలిగే నష్టాలునేలలో కార్బన్ శాతం తగ్గుతుంది. కాల్చినపుడు ఉద్భారమయ్యే ధూళి, పొగ శ్వాస సంబంధిత సమస్యలకు కారణమవు తుంది. నేల ఉపరితలంలోని ఉష్ణోగ్రత సెంటీమీటర్ కు 8 డిగ్రీల వరకు పెరిగి, మేలు చేసే శుభజీవులు (బ్యాక్టీరియా, ఫంగస్) చనిపోతాయి. కాల్చే ప్రక్రియలో విడుదలయ్యే కార్బన్ డయాక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్ వాతావరణ ఉష్ణోగ్రతను పెంచుతాయి.ఒక టన్ను పంట వ్యర్థాలు కాల్చిన పట్ల నేలలోని పోషకాలు: సుమారు 5.5 నిల నత్రజని, 2 నిల ఫాస్ఫరస్, 2.5 kD పొటాష్, 1 kD సేంద్రీయ కార్బన్ నష్టపోతాయి. పంట అవశేషాలను కాల్చ కుండానే ఉపయోగిం చడం వల్ల రైతులకు లభించే ప్రయోజనాలు పశువులకు మేతగా లేదా బెడ్డింగ్ పదార్థంగా ఉపయోగం చవచ్చు.కంపోస్ట్ తయారీకి మూల పదార్థంగా, బయోగ్యాస్ ఉత్పత్తికి, ఇథనాల తయారీలో ఉపయోగపడతాయి. పుట్టగొడుగు పెంపకంలో మరియు బైచార్ తయారీలో భాగంగా వాడుకోవచ్చు.నేల తేమను నిలుపు కునేందుకు మల్చింగ్గా ఉపయోగిస్తారు. అవశేషాలు నత్రజని, ఫాస్ఫరస్, పొటాషియం మరియు సూక్ష్మ పోషకాలు కలిగి ఉంటాయి. ఇవి సూక్ష్మ జీవుల కన్సార్షియం ద్వారా ఎరువుగా మారితే భూమి భౌతిక, రసాయనాత్మక లక్షణాలు మెరుగవుతాయి. మీకెందుకు చేయాలో సూచనలుపంట అవశేషాలను పొలంలోనే కలియ దున్నించి, కంపోస్ట్ లేదా పక్కా సేంద్రియ ఎరువు తయారీలో వినియోగించండి. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పబ్బతి ఆంజనేయస్వామి 16వ వార్షిక ఉత్సవాలు

### మల్కాజిగిరి కమిషనర్ బదుగుల సుమతి పట్టు వస్త్రాలు సమర్పణ



**హాలియా జనంసాక్షి మే 27:** అనుములమండల పరిధిలోని , నాయుడు పాలెం: గ్రామంలో వెలసిన శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయం ఈ నెల 27 నుంచి 31 వరకు ఐదు రోజుల పాటు ఘనంగా 16వ వార్షికోత్సవాలను నిర్వహించనుందని ఆలయ కమిటీ ప్రకటించింది. ఉత్సవాల ప్రారంభ సందర్భంగా మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బదుగుల సుమతి శనివారం స్వామివారికి పట్టు వస్త్రాలను గ్రామానికి చెందిన కందుల రాజేందర్ రెడ్డి ద్వారా సమర్పించారు.ఆలయ కమిటీ వెల్లడించిన ప్రతిపాదన ప్రకారం, ఉత్సవాలు భోగ్ బండారు, ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలతో ప్రారంభమవుతాయి. 28వ తేదీన ప్రత్యేక గణపతి పూజలు నిర్వహించబడతాయని, 29వ తేదీన హోమాలు, యజ్ఞాలు భక్తిశ్రద్ధలతో జరగ నున్నట్లు కమిటీ తెలిపింది. ఉత్సవాల ముగింపు కార్యక్రమాలు 31వ తేదీన వైభవంగా హతాత్ నిర్వహిస్తారు.ఆయన కమిటీ తెలిపిందీ కార్యక్రమాలకి పట్టణం పాటు పక్కవ గ్రామాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవాలని, స్వామివారి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని తెలిపారు.

## వడదెబ్బ మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి: నారీ ఐలయ్య

**చండూరు, మే 27 (జనంసాక్షి)**

వడ దెబ్బతో మృతి చెందిన ఉపాధి హామీ కూలీల కుటుంబాలకు ప్రభుత్వమే 10 లక్షల రూపాయలు ఇచ్చి ఆదుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారీ ఐలయ్య కోరారు.బుధవారం రోజున చండూరు మండలంలోని నెర్మట గ్రామం లో తెలంగాణవ్యవసాయ కార్మిక సంఘం మండల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా నారి ఐలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తీవ్రమైన ఎండలు ఏర్పడడం వలన 47 మంది వ్యవసాయ కార్మికులు వడదెబ్బకు గురై మరణించారని వారి కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించి ఆదుకొని వారికి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్రనీ ఏర్పడిన నాటి నుండి నేటి వరకు వ్యవసాయ కార్మికులకు కనీస వేతన జీవోను అమలు చేయలేదని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుదలకు అనుగుణంగా వ్యవసాయంలో పనిచేసే కార్మికులందరికీ కనీస వేతనం సవరించి కొత్త జీవో తెస్తానని చెప్పి అధికారంలోకి వచ్చినేటికీ రెండు సంవత్సరాల ఆరు నెలలు గడుస్తున్న అమలుకు నోచుకోలేదని వెంటనే కనీస వేతన జీవోను సవరించి అమలు చేయాలని కోరారు.దేశవ్యాప్తంగా పెట్రోల్ డీజిల్ ధరలను ఇప్పటికే ఆరుసార్లు పెంచి సామాన్య ప్రజలపై అదనపు భారం మోపిందని దీని మూలంగా రకరకాల నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని ఫలితంగా ఆర్థిక ఇబ్బందులు గురవుతున్నారని తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చాడని,అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలోని వ్యవసాయ పేదలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద 12 వేల రూపాయలు ఇస్తామన్నాడని, అలాగే మహిళలకు నెలకు 2500 రూపాయలు, 57 సంవత్సరాలు నిండిన వ్యవసాయ కార్మికులందరికీ 5000 పెన్షన్ ఇస్తామని చెప్పి నేటికీ అమలు చేయలేదని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేసి వ్యవసాయ కార్మికులకు తగిన తోడ్పాటును అందించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బండ శ్రీశైలం, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు జెర్రిపోతుల ధనంజయ, వ్యవసాయ కార్మిక సంఘం చండూరు మండల కార్యదర్శి బల్లెం స్వామి, రైతు సంఘం మండల కార్యదర్శి ఈరటి వెంకటయ్య, నారపాక నరసింహ, కొత్తపల్లి నరసింహ, రాచమల్ల లక్ష్మయ్య,ఆర్.సైదులు జె. రాజు, నారపాక శంకర్,బురుకుల కృష్ణయ్య, లక్ష్మమ్మ, యాదయ్య, నరసింహ, అంజయ్య, దశరథ, వెంకన్న, సైదులు, శ్రీశైలం, పర్వతాలు, ఈ. నరసింహ, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.





## అకాల వర్షాలతో తడిసిన ధాన్యంను కొంటాం

### రైతులకు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ భరోసా

### మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ఆలస్యమైతే చర్యలు

### రవాణా సమస్యల పరిష్కారానికి పోలీసు, రవాణా శాఖల సమన్వయం

### జిల్లా ఎస్పీ కె.నరసింహతో కలిసి కొనుగోలు కేంద్రాల ఆకస్మిక తనిఖీ

సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):

ధాన్యం సేకరణ ప్రక్రియలో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న అడ్డంకులను అధిగమిస్తూ, ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పేర్కొన్నారు.బుధవారం జిల్లా ఎస్పీ కె.నరసింహతో కలిసి ఆయన ఆత్మకూర్ (ఎస్) మండల కేంద్రంలోని పివైఆర్ రైస్ మిల్లును, ఏపూరు గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. క్షేత్రస్థాయిలో కొనుగోలు తీరును, తూకాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు.ధాన్యం కొనుగోళ్లలో ప్రధానంగా ఎదురవుతున్న లారీల కొరత, హమాలీల ఇబ్బందులు, అన్‌లోడింగ్ ఆలస్యం వంటి సమస్యలను గుర్తించామని, వాటి పరిష్కారానికి యుద్ధప్రతిపాదికన చర్యలు చేపట్టామని తెలిపారు.రవాణా, పోలీస్ శాఖల సమన్వయంతో అన్ని రకాల వాహనాలను ధాన్యపు రవాణాకు మళ్లించడం జరుగుతుందని అన్నారు.ప్రతి రైస్ మిల్లుకు ఒక ప్రత్యేక ఇన్‌ఛార్జ్ నియామకం, అదనపు హమాలీల ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుత అకాల వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అలర్ట్ మెకానిజం సిద్ధం చేసిందని కలెక్టర్ తెలిపారు.అకాల వర్షాల వల్ల ధాన్యం తడిస్తే రైతులు అస్సలు ఆందోళన చెందవద్దని, తడిసిన ధాన్యాన్ని వెంటనే గుర్తించి, బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించేలా జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకుందని, రైతులకు నష్టం జరగనివ్వమని అన్నారు.రెవెన్యూ, సివిల్ సప్లై, పోలీస్ శాఖలు పరస్పరం సమన్వయం చేసుకుంటూ ధాన్యం సేకరణను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక కోఆర్డినేటర్లు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ పిడి సన్యాసయ్య,తహసిల్దార్ హామిన్ సింగ్, ఎంపీడీవో అసీం అలీ, ఏవో దివ్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

**మునుగోడు, మే 27, (జనం సాక్షి)**

మునుగోడు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మద్దతు ఇచ్చేందుకు కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన నగదు ప్రోత్సాహకాలు ప్రభుత్వ పాఠశాల లను బలోపేతం చేయనుంది, ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రథమ బహుమతిగా 25 వేలు, ద్వితీయ 15 వేలు, తృతీయ పదివేలు నగదు ప్రోత్సాహ బహుమతులను అందజేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉత్తమ ర్యాంకులు సాధించిన కొంపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ధాం శ్రీవల్లికి 25 వేలు, దాసరి యామినికి 15 వేలు, సాక్షిత కి 10 వేలు అందజేశారు.కొంపల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన ప్రతిభావంతులైన 10వ తరగతి విద్యార్థులకు ఫౌండేషన్ మొత్తం 50,000 నగదు బహుమతులను అందించారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి ఫౌండేషన్ చేస్తున్న ప్రయత్నాలను గ్రామ సర్పంచ్ నిర్మల దశరథ, వైస్ చైర్మన్ వేదిరే విజేందర్ రెడ్డితో సహా స్థానిక నాయకులు ప్రశంసించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయుడు గీరి నరసింహ ,ఫిజికల్ డైరెక్టర్ కొండేటి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి బహుమతులు పొందడం అభినందనీయమని అన్నారు .ఈ సందర్భంగా కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ వారికి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి పాఠశాల ఉపాధ్యాయుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.



## స్నేహితులతో వెళ్లి తిరిగిరాని లోకాలకు

**చింతలపాలెం(జనంసాక్షి)**



చింతలపాలెం గ్రామానికి చెందిన గొంగరెడ్డి సాయి కుమార్ రెడ్డి (22) ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందిన ఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది.కుటుంబ సభ్యులు, స్థానికుల వివరాల ప్రకారం సాయి కుమార్ రెడ్డి గుజరాత్‌లో బీటెక్ పూర్తి చేసి ఉద్యోగ అవకాశాల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంటర్మీడియ ట్ స్నేహితులు పిలవడంతో ఇంటి నుంచి బయలుదేరే ముందు తల్లికి కోదాడకు వెళ్లి వస్తానని చెప్పినట్లు స్థానికులు తెలిపారు.తర్వాత స్నేహితు లతో కలిసి గుడిబండ పొలాల సమీపం లోని బాయి వద్దకు ఈత కోసం వెళ్లగా, ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందినట్లు తెలిసింది.ఈ ఘటనతో చింతలపాలెం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.కుమారు డి ఉన్నత విద్య కోసం కుటుంబ సభ్య లు ఇంటి ముందు ఉన్న స్థలాన్ని సుమారు 25 లక్షల రూపాయలకు విక్రయించి,ఇల్లు నిర్మాణాన్ని కూడా వాయిదా వేసి చదువుల కోసం ఖర్చు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.కుమా రుడు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎన్నో ఆశలు పెట్టుకున్న కుటుంబ సభ్యులకు ఈ ఘటన తీరని విషాదాన్ని మిగిల్చింది.ఈ ఘటన గ్రామస్థులను కలచివేసింది.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

### వ్యవసాయ అధికారి ఎం సరిత



**హాలియా జనంసాక్షి మే 27 :** రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎం సరిత అన్నారు బుధవారం నాడు హాలియాలో పలు షాపులను క్షేత్రస్థాయిలో తనిఖీ నిర్వహించారు ఈ సందర్భం గా మాట్లాడుతూ లకు నాణ్యమైన విత్తనాలు అందించాలని రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రసీదు భద్రపరచుకోవాలని తెలిపారు. శ్రీ రామకృష్ణ ఫర్టిలైజర్స్, లక్ష్మీ సీడ్స్, పేరూర్ రోడ్ తన డీలర్ షాపులలోని మండల వ్యవసాయ అధికారి ఓ. వెంకన్న, వ్యవసాయ సహాయ సంచాలకు రాలు ఓ. సరిత గారు పత్తి విత్తనాల ప్యాకెట్లను మరియు అట్టి కంపెనీలకు సంబంధించిన ఇన్వాయిస్ రికార్డులను,బిల్ బుక్ లను తనిఖీ చేయడం జరిగినది. మండలంలోని ప్రతి డీలరు నాణ్యమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచవలసిందిగా తెలియజేయడమైనది. ప్రతి రైతుకు విత్తన కొనుగోలుకు సంబంధించిన రసీదు పత్రం కచ్చితంగా ఇవ్వాల్సిందిగా సూచించనైనది.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ కు వినతి

**రామన్నపేట, మే 27 (జనంసాక్షి):**

రామన్నపేట మండల వ్యాప్తంగా మందకొడిగా సాగుతున్న ధాన్యం కొనుగోలును వేగవంతం చేసి వారం రోజుల్లో కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జల్లెల పెంటయ్య డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు సమీక్ష సందర్భంగా రామన్నపేటకు వచ్చిన రెవిన్యూ జాయింట్ కలెక్టర్ వెంకారెడ్డికి రైతు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామన్నపేట మండలంలో సుమారుగా 3 లక్షల క్వింటాళ్ల ధాన్యం నిల్వ ఉన్నదని రోహిణి కార్తె ప్రారంభం కావడంతో ఇప్పటికే దున్నకాలు ప్రారంభించారని గత రెండు నెలలుగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ మందకోడిగా సాగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తాలు,తరుగుడు పేరుతో రైస్ మిల్లర్లు కొర్రీలు పెట్టి రైతులను ఇబ్బంది పెడుతున్నారని యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోలను వేగవంతం చేసి ప్రతి ఐకెపి సెంటర్కు ఐదు లారీలను అందుబాటులో ఉంచి గోదాంలో సన్నద్ధం చేయాలని అన్నారు. ఇప్పటికే ఈదురు గాలులతో వర్షాలు కురుస్తుండడంతో ధాన్యం తడిసి మొలకెత్తే ప్రభావం ఉందని వెంటనే అధికారులు స్పందించాలని లేనిపక్షంలో రైతులు తీవ్ర ఆందోళన నిర్వహిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, జిల్లా కమిటీ సభ్యులు బల్గురి అంజయ్య,రైతు సంఘం మండల కార్యదర్శి గన్నెబోయిన విజయభాస్కర్,వ్యకాస మండల అధ్యక్షులు మేడి ముకుంద, నాగటి లక్ష్మణ్, మార్త భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.